ఈనాడు
epaper.eenadu.net

# మెట్రో వలయం

**నాగోల్-ఎల్బీనగర్ లింక్ పూర్తికి హెచ్ఏఎంఎల్ ప్రాధాన్యం**

ఈనాడు, హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశలో నాగోల్-ఎల్బీనగర్ మార్గాన్ని కలపడాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అత్యంత ప్రాధాన్యంగా భావిస్తోంది. 5 కి.మీ. స్వల్ప దూరం ఉండే ఈ కొద్ది మార్గాన్ని పూర్తి చేస్తే సిటీలోని రెండో వలయ(సర్క్యులర్) మెట్రోకారిడార్ అందుబాటులోకి వచ్చినట్లు అవుతుందని మెట్రో అధికారులు అంటున్నారు. పాతబస్తీ తొలి ప్రాధాన్యత అయితే లింక్ కలపడం మలి ప్రాధాన్యతగా చెబుతున్నారు.

మెట్రోరైలు మొదటి దశలో జేబీఎస్-ఎంజీబీఎస్-అమీర్‌పేట మార్గాల్లో ఇప్పటికే ఒక వలయ మెట్రో అందుబాటులో ఉంది. వలయమైనా ఒకటే మెట్రోలో ప్రయాణించలేం.. మెట్రోలు మారాల్సి ఉంటుంది.




వలయ మెట్రో మార్గానికి మిగిలిన లింక్ ఇదే

## ఇవీ ప్రయోజనాలు

● వలయ మార్గంలో గమ్యస్థానం చేరేందుకు మెట్రో దిగి బస్సులు, ఆటోలను, క్యాబ్‌లను ఆశ్రయించాల్సిన అవసరం తప్పుతుంది. కేవలం మెట్రో మారితే సరిపోతుంది. ● నిర్దిష్ట సమయంలోనే గమ్యస్థానం చేరుకోవచ్చు. సమయం చాలా కలిసి వస్తుంది. ● సాంకేతికత సమస్యలతో ఒక మార్గంలో సమస్యలు తలెత్తితే రెండో మార్గాన్ని ఉపయోగించుకోవచ్చు. ● వలయం కాబట్టి ఏ మార్గంలో వెళ్లినా గమ్యస్థానం చేరుకోవచ్చు. కాకపోతే గమ్యం చేరే సమయాల్లో తేడాలు ఉంటాయి.

## రాబోయేది పెద్దది...

● నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు రెండో దశలో ప్రాధాన్యంగా తొలుత పూర్తి చేస్తే ఎల్బీనగర్-అమీర్‌పేట-ఎల్బీనగర్ వరకు పెద్ద ఒక వలయ మెట్రో అవుతుంది. మొదటి దానితో పోలిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఈ పరిధిలోనే 41 స్టేషన్లు ఉండబోతున్నాయి.

● నాగోల్ నుంచి ఎంజీబీఎస్‌కు మెట్రోలో వెళ్లాలంటే ఇప్పుడు నాగోల్ నుంచి పరేడ్‌గ్రౌండ్‌కు వెళ్లి అక్కడి నుంచి ఎంజీబీఎస్‌కు చేరుకోవాల్సి వస్తుంది. దీనికంటే బస్సులో వెళితే తొందరగా గమ్యస్థానం చేరుకోవచ్చు అనేది ప్రయాణికుల అభిప్రాయం. వలయ మెట్రో మార్గం పూర్తైతే నాగోల్‌నుంచి ఎల్బీనగర్-ఎంజీబీఎస్‌కు చాలా తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఈ తరహా ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుకానున్నాయి

## మూడో మార్గం కూడా

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మెట్రో మార్గం. ఎల్బీనగర్ నుంచి చాంద్రాయణగుట్ట మార్గం పూర్తిచేస్తే మూడో వలయ మార్గం అవుతుంది. అప్పుడు దిల్‌సుఖ్‌నగర్ స్టేషన్ నుంచి ఈ సర్క్యులర్‌లో తమకు కావాల్సిన స్టేషన్‌కు సౌకర్యంగా మెట్రోలోనే చేరుకోవచ్చు.

Date : 13/12/2024 EditionName : GREATER HYDERABAD PageNo :